నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

I హైదరాబాద్, శనివారం 24 మే 2025 RANGAREDDY


## అశ్లీల వీడియోలు అప్‌లోడ్ చేసిన వారిపై కేసు



వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 23 : చైల్డ్ పోర్న్ వీడియోలను చూసి, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన వ్యక్తులపై చన్గోముల్, పరిగి ఠాణాల్లో కేసులు నమోదు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు చైల్డ్ పోర్న్ వీడియోలను చూసి, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని.. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడడం లేదా గూగుల్‌లో వాటి కోసం వెతకడం వంటి చర్యలను జిల్లా పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. ఇది సైబర్ నేరాల పరిధిలోకి వస్తుందన్నారు.



### లక్ష్యం.. రూ. 600 కోట్లకు పైగా.. వచ్చింది రూ. 255 కోట్లే..

- మూడుసార్లు గడువు పెంచినా ఎల్ఆర్ఎస్‌కు స్పందన అంతంతే
- 25 శాతం రాయితీ ఇచ్చినా అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ముందుకు రాని దరఖాస్తుదారులు
- రంగారెడ్డి జిల్లాలో రెగ్యులరైజేషన్‌కు వచ్చిన అప్లికేషన్లు 2,56,000

# అరకొరే..

రంగారెడ్డి, మే 23 (నమస్తే తెలంగాణ) : అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం మూడుసార్లు గడువు పొడిగించినా జిల్లాలోని దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. దీంతో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. కాగా ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం 2,56,000 దరఖాస్తులు రాగా.. వాటిలో 1,78,600 అప్లికేషన్లు మాత్రమే రెగ్యులరైజేషన్‌కు అర్హత పొందగా.. ప్రభుత్వానికి రూ.255 కోట్ల రాబడి సమకూరింది. మిగిలిన 1,20,000 దరఖాస్తులను త్వరగా క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు యజమానులకు నోటీసులు జారీ చేసినా వారు ముందుకు రావడం లేదు. అయితే, నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి 77,332 అప్లికేషన్లు రాగా వాటిని అధికారులు రిజెక్ట్ చేశారు.

### లక్ష్యం.. రూ. 600 కోట్లకు పైగా..

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ద్వారా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడం ద్వారా రూ.600 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా ఇప్పటివరకు రూ.255 కోట్ల ఆదాయమే సమకూరింది. ఖాళీ ప్లాట్లు, అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు 2020లో గత ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. లేఅవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుకు రూ.10,000, ఖాళీ ప్లాట్లకు రూ. 1000గా నిర్ణయించింది. ఈ మేరకు హెచ్ఎండీఏ పరిధిలోని మూడు కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీల నుంచి దాదాపుగా 2,56,000 దరఖాస్తులొచ్చాయి. అలాగే, జిల్లాలోని వివిధ మండలాల నుంచి కూడా 45,000 పైగా అప్లికేషన్లు వచ్చాయి. అయితే, గత ప్రభుత్వంలో పలు కారణాలతో క్రమబద్ధీకరణ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఫిబ్రవరిలో వన్‌టైం సెటిల్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చి 25 శాతం రాయితీ ప్రకటించింది. మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం వాటి పరిశీలన కోసం రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. తొలి గడువు మార్చి 31తో ముగిసినా.. ఆశించిన స్థాయిలో ప్లాట్ల క్రమబద్ధీకరణ కు యజమానులు ముందుకు రాకపోవడంతో ఆ గడువును ఏప్రిల్ 30 వరకు పెంచింది. ఆ గడువు కూడా ముగిసిపోవడంతో మూడోసారి ఈనెల 31 వరకు పొడిగిస్తూ తాజాగా సర్కార్ ఉత్తర్వులను జారీచేసింది.

### అధికారులకు అదనపు బాధ్యతలతో తీవ్ర జాప్యం..

ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ శాఖల అధికారులు పరిశీలించిన తర్వాతే కమిషనర్ లాగిన్‌కు పంపిస్తారు. ఆ తర్వాత వాటిని కమిషనర్ ఫైనల్ చేస్తారు. కానీ, జిల్లాలో ఓ వైపు టీపీవోల కొరత, మరోవైపు భూభారతి వంటి పథకం ద్వారా రెవెన్యూ సిబ్బందికి అదనపు పనులను అప్పగించడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కూడా అందుబాటులో ఉండడంలేదు. మరోవైపు ఇరిగేషన్ అధికారులు కూడా హైడ్రా ఆదేశాలతో చెరువులు, కుంటలపైనే దృష్టి సారించారు. దీంతో క్రమబద్ధీకరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ శాఖల అధికారుల చుట్టూ తిరగలేక ప్లాట్ల యజమానులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ కారణాలతోనే ప్లాట్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతున్నదన్న ఆరోపణలున్నాయి.

### శివారుల్లోనూ అంతంతే..

హైదరాబాద్ శివారుల్లోని రంగారెడ్డి జిల్లాలో గతంలో పెద్ద ఎత్తున పంచాయతీ లేఅవుట్లతో ప్లాట్లుచేసి విక్రయించారు. ఆయా వెం చర్లలో ప్లాట్లు కొన్న వారికి ఎల్ఆర్ఎస్ లేదు. శివారు ల్లో భూముల ధరలు విపరీతంగా పెరుగుతున్నా ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్ల యజమానులూ క్రమబద్ధీకరణకు ముందుకు రావడంలేదు. ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని ప్రభుత్వం నోటీసులిచ్చినా స్పందించడంలేదు. దీంతో జిల్లా నుంచి ఎల్ఆర్ఎస్ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 50శాతం కూడా వచ్చే అవకాశం కనిపించడంలేదనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు మరోసారి అవకాశం ఇస్తుందా..? లేక క్రమబద్ధీకరించుకోని ప్లాట్ల యజమానులపై చర్యలు తీసుకుంటుందా..? అనేది త్వరలోనే తెలియనున్నది.


---

అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్నదాతను నిలువునా ముంచుతున్నది. అధికారంలోకి వచ్చి 12 నెలలు దాటిన తర్వాత రైతుబంధు పెట్టుబడి సాయాన్ని అందించగా.. అది కూడా అరకొర పంపిణీ చేయడంతో అర్హులైన వేలాది మంది రైతన్నలు పంటల సాగు కోసం వడ్డీ వ్యాపారుల వద్ద అప్పుల చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. అధిక వడ్డీకి తీసుకొచ్చిన రుణాలను చెల్లించలేక కర్షకులు బల వన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇలా జిల్లాలో 18 నెలల కాంగ్రెస్ పాలనలో 55 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే అన్నదాతకు కష్టాలు ప్రారంభమయ్యాయని.. బీఆర్ఎస్ హయాంలోనే వ్యవసాయం పండుగలా సాగి అన్నదాత సంతోషంగా ఉన్నాడని పలువురు పేర్కొంటున్నారు.

- ఆరుగాలం కష్టించినా కర్షకులకు తప్పని కష్టాలు
- రైతులకు హామీనిచ్చి మోసం చేసిన రేవంత్ సర్కార్
- అధికారంలోకి వచ్చిన ఏడాదికి అమల్లోకి రైతు భరోసా
- పెట్టుబడి సాయం అందక.. వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు
- అతివృష్టి, అనావృష్టితో అతలాకుతలం
- రుణాలివ్వడంలో బ్యాంకర్ల నిర్లక్ష్యం
- అప్పులు తీర్చే మార్గం లేక బలవన్మరణాలు

# ఎవుసం బరువై.. ఉరితాడే ఉయ్యాలై

## 18 నెలల్లో 55 ఆత్మహత్యలు





## కాంగ్రెస్ పాలనలో అన్నదాతకు మిగిలింది కన్నీరే

వికారాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం కష్టపడే అన్నదాతను ఆదుకునే వారు లేక.. ఎవుసం చేయలేక మధ్యలోనే కాడి వదిలేస్తున్నాడు. దేశానికి వెన్నుముక అంటూ నాయకులు తమ ప్రసంగాల్లో గొప్పగా చెప్పడం తప్పా.. రైతన్నను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పంటల సాగుకు తీసుకొచ్చిన అప్పులను తీర్చలేక.. కుటుంబాన్ని పోషించే మార్గం కనిపించక చాలామంది అన్నదాతలు తనువు చాలిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయాన్ని బలోపేతం చేసేలా, రైతు ఆర్థికంగా వృద్ధి చెందేలా తోడ్పాటునందిస్తే.. 18 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతన్నను నట్టేట ముంచుతున్నది. అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో.. ఏడాదిన్నరలో చాలామంది అన్నదాతల ఆత్మహత్యలకు కారణమయ్యింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో మెజార్టీ ఓటర్లైన రైతులు ఓటేసి గెలిపిస్తే పవర్‌లోకి వచ్చిన తర్వాత రేవంత్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తూనే ఉన్నది. గతంలో సీజన్‌కు ముందే విత్తనాలు, ఎరువుల నిమిత్తం కేసీఆర్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందజేస్తే.. 18 నెలల కాంగ్రెస్ పార్టీ ఒక్క సీజన్‌కు కూడా రైతులందరికీ పంటల సాగుకు పెట్టుబడి సాయం అందించకపోవడం శోచనీయం. ఓ వైపు అతివృష్టి, మరో వైపు అనావృష్టితో అన్నదాత ఆగమవుతున్నా సర్కార్ పట్టించుకోవడం లేదు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోవడం.. సకాలంలో అందని ఎరువులు, విత్తనాలు, ఎరువుల కోసం ఉమ్మడి రాష్ట్రంలో క్యూలైన్లలో నిరీక్షించిన విధంగా మళ్లీ ఇప్పుడు ఉండాల్సిన దుస్థితి నెలకొన్నది. అదేవిధంగా అరకొర సరఫరా అవుతున్నా విద్యుత్తుతో అన్నదాత అవస్థలు పడుతున్నాడు.

### 55 మంది రైతుల బలవన్మరణాలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే అన్నదాతకు కష్టాలు మొదలయ్యాయి. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం పండుగలా సాగితే.. ప్రస్తుతం దండుగలా మారింది. కేసీఆర్ హయాంలో అప్పుల కోసం చూడని అన్నదాత.. ఇప్పుడు పంటల సాగు కోసం వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ హయాంలో సీజన్ ప్రారంభానికి ముందే విత్తనాలు, ఎరువులను కొనేందుకు రైతుబంధు సాయాన్ని పంపిణీ చేయగా.. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఏడాదికి రైతుభరోసాను అమల్లోకి తీసుకొచ్చి.. కొంతమందికే పెట్టుబడి సాయాన్ని అందించి చేతులు దులుపుకొన్నది. దీంతో అర్హులైన చాలా మంది అన్నదాతలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రైతును రాజుగా చేసే ఆలోచనతో రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేలా కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టడంతోపాటు రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చింది. సీజన్‌కు ముందే పెట్టుబడి సాయాన్ని అందించడంతో పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పంట రుణాలు తీసుకునే రైతుల సంఖ్య సగానికిపైగా తగ్గిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తామంటూ హామీనిచ్చి మోసం చేయడంతోపాటు బ్యాంకర్లు పంట రుణాలనూ మంజూరు చేయకపోవడంతో అన్నదాతలు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ఎక్కువ వడ్డీకి తీసుకున్న అప్పు చెల్లించకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కరెంట్ కోతలు, పెట్టుబడి సాయం, మద్దతు ధర అందకపోవడంతో రైతులు బలవన్మరణాలను పాల్పడుతున్నారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో జిల్లాలో 55 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ యజమాని ఆత్మహత్యతో సంబంధిత రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో నేడు పల్లెపల్లెన కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు. అడగడుగునా కష్టాలపాలు చేస్తున్న కాంగ్రెస్‌ను దుమ్మెత్తి పోస్తున్నారు.



---

# చచ్చినా..డబ్బులివ్వం!



### ఎల్ఐసీకి రైతుబీమా ప్రీమియం చెల్లించని రేవంత్ సర్కార్

- గత నాలుగు నెలలుగా నిలిచిన రైతుబీమా డబ్బులు
- రంగారెడ్డి జిల్లాలో 117 మంది రైతు కుటుంబాల ఎదురుచూపు
- రైతు కుటుంబాలు వీధిన పడొద్దనే సదుద్దేశంతో రైతుబీమా పథకానికి శ్రీకారం చుట్టిన కేసీఆర్
- బీఆర్ఎస్ హయాంలో వారం, పది రోజుల్లో రూ.5 లక్షల బీమా డబ్బులు బాధిత కుటుంబానికి అందజేత

షాబాద్, మే 23 : ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్న ప్రమాదవశాత్తు ఏ కారణం చేతనైనా మృతి చెందితే ఆ కుటుంబం వీధిన పడొద్దనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతి ఏడాది రైతుల పేరిట ప్రభుత్వమే రూ.3,556 ప్రీమియం చెల్లించింది. రైతు చనిపోతే వారం, పది రోజుల్లో నామినీ ఖాతాలో రూ.5లక్షల బీమా డబ్బులు జమ అయ్యేవి. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడంతో బీమా డబ్బులు అందడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 117 మంది రైతులు చనిపోగా.. వారికి ఇప్పటికీ బీమా డబ్బులు అందలేదు. ఏమైందని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే తమ వద్ద ఏమి పెండింగ్‌లో లేవని.. మీ డాక్యుమెంట్లను ఉన్నతాధికారులకు పంపించామని చెబుతున్నట్లు సమాచారం.

### రైతు కుటుంబాల ఎదురుచూపు..

రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాల్లో 117 మంది రైతులు వివిధ కారణాలతో మృతిచెందారు. బీమాకు సంబంధించిన పత్రాలకు ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులకు అందజేశారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు రైతులకు బీమా డబ్బులు రావడమే లేదు. ప్రభుత్వం ప్రతి ఏడాది రైతుల పేరిట ఎల్ఐసీకి ప్రీమియం సరిపడా చెల్లించకపోవడంతోనే రైతు బీమా డబ్బులు నిలిపోయినట్లు తెలుస్తుంది.

### కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్న రైతులు..

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల సంక్షేమానికి కేసీఆర్ తీసుకున్న చర్యలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు. అదునుకు ముందే పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయడంతోపాటు రైతు చనిపోతే వారం రోజుల్లోనే బాధిత కుటుంబానికి బీమా డబ్బులు అందేలా చర్యలు తీసుకున్నారు. కరెంట్, నీళ్ల తదితర విషయాల్లో రైతులను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదని అన్నదాతలు జ్ఞప్తి చేసుకుంటున్నారు. రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే.. బాధిత కుటుంబం రోడ్డున పడొద్దనే సదుద్దేశంతో 2018 ఆగస్టు 15న రైతు బీమా పథకాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి 2023 ఆగస్టు 15 వరకు ప్రతి ఏడాది అన్నదాత పేరిట ఆగస్టు 15లోపు రూ.3,556 ప్రీమియం డబ్బులు చెల్లించి రైతు పేరిట బీమాను రెన్యువల్ చేయించేవారు. కేసీఆర్ ఉన్నప్పుడే అన్నదాతకు మేలు జరిగిందని అన్నదాతలు చెబుతున్నారు.

### రైతన్నను మోసం చేస్తున్న కాంగ్రెస్..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతను మోసం చేస్తూనే ఉన్నది. రైతుభరోసా, రుణమాఫీ, రైతుబీమా వంటి పథకాలు సకాలంలో అందించక రైతన్నను ఆగం చేస్తున్నది. రుణమాఫీ సగమందికే చేసిన ప్రభుత్వం, రైతుభరోసా కూడా అంతంతా మాత్రంగానే చేసి చేతులు దులుపుకొన్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు చనిపోతే రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని కేసీఆర్ ప్రభుత్వం కల్పించి ఆదుకున్నది. ఆ బీమా పథకాన్ని కూడా రేవంత్ సర్కార్ సక్రమంగా అమలు చేయకపోవడం చాలా దారుణం. **-గంగిడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు, హైతాబాద్, షాబాద్ మండలం**



### బీమా డబ్బులు చెల్లించడంలో ఆలస్యం సరికాదు



రైతు బీమా డబ్బులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు. ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడంతో వివిధ కారణాలతో రైతులు మృతిచెందితే, ఆ రైతు కుటుంబాలకు బీమా డబ్బులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అన్నదాత బాగు కోసమే గత కేసీఆర్ ప్రభుత్వం పనిచేసింది. కానీ, ప్రస్తుత రేవంత్ సర్కార్ మాత్రం రైతన్నను పట్టించుకోకపోవడం దారుణం. పెండింగ్‌లో ఉన్న బీమా డబ్బులను చెల్లించి రైతు కుటుంబాలను ఆదుకోవాలి.

**-కుమార్, రైతు కుమ్మరిగూడ, షాబాద్ మండలం**

### రైతులకు అండగా రైతుబీమా..

రేవంత్ సర్కార్ బీమా ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం దారుణం. అన్నదాతల బాగుకోసం గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. రైతుల పేరిట ప్రతి ఏడాది ఆగస్టులోనే బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించి అన్నదాతకు రూ.5 లక్షల బీమా కల్పించింది. రైతు చనిపోతే వారం, పది రోజుల్లో నామినీ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి.



**-చెన్నయ్య, రైతు బోడంపహాడ్, షాబాద్**



## మరమ్మతులు పూర్తి

నమస్తే ఎఫెక్ట్

మాడ్గుల, మే 23 : మండలంలోని పాత బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో మిషన్ భగీరథ పైపు పగిలి రెండు రోజులుగా మంచి నీరు వృథాగా పోతున్నదని.. 'వృథాగా మిషన్ భగీరథ నీరు' శీర్షికన 'నమస్తే తెలం గాణ'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం పైపు పగిలిన భాగానికి మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'నమస్తే తెలంగాణ'కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.